

# మారిన ధర్మం

ప్రణవి

జడి రఘుపతిగారింట్లో పెళ్ళివేడుకలు జోరుగా జరుగుతున్నాయి పెద్ద పందిరి వేశారు రంగు కాయితాల తోరణాలు కట్టారు. కొత్త బట్టలు, నగలు, అబ్బో! యెన్నెన్నో సరుకులు, సరంజామాలు పెళ్ళివారింటికొస్తున్నాయి. పెళ్ళిసంరంబం ముమ్మరంగా వుండడానికి కారణం ఆయన ప్రప్రథమంగా చేయబోతున్న పెళ్ళి! పైగా, తన ముద్దుల రెండవ కుమార్తెకు! ... చుట్టపక్కాల హడావుడీ కూడా యెక్కువగానే వుంది. అంతా యేదో వో బాధ్యత నెత్తిన వేసుకున్ని ఇటూ-అటూ తిరిగేస్తున్నారు. యెవరికి వారు తాము చెయ్యకపోతే ఆ పని ఆగిపోతుందేమో నన్నంత ఫీలింగు. పెళ్ళింకా సరిగ్గా రెండ్రోజులే వుంది!

ఆడపా - దడపా అమ్మలక్కలు యేదో వో మూల వో నిమిషమాగి, చెవులు కొరుక్కోడం; ముక్కున వేలేసుకోవడం; ముసిముసి నవ్వులు నవ్వుకోవడం వగైరాలు చేస్తూనేవున్నారు.

ఇవేమీ పట్టించుకోక, పెళ్ళి యెవరింట్లోనో, యెవరికో అనే భావనతో వున్నట్టు కనిపిస్తుంది. పెళ్ళి కుమార్తెకు స్వయానతల్లి, రఘుపతిగారి ప్రియమైన భార్య అయిన మాలతి!

ఆమె అలంకరించుకొని, అలావోకగా హాల్లో కూర్చుంది ఆలోచనలు, చూపులు యెక్కడో కేంద్రీకృతమై వున్నాయి! దేనికోసమో తీరని ఆవేదనతో నిరీక్షిస్తున్నట్లుంది

ఆరోజు పోస్టులో మాలతి పేరున వో కవరొచ్చింది. దానివంక చూసి బాధగా నిట్టూర్చింది. ఆ రాత తనకి బాగా గుర్తే! తాను ఆ కవరును ఆశించ లేదు. ఆ కవరు వ్రాసిన వ్యక్తి సమక్షాన్ని నిరీక్షించింది! కానీ ఏంలాభం? తాను స్వయంగా వెళ్ళి, శుభలేఖ యిచ్చి ఆహ్వానించలేకపోయింది. అందుకే అభిమానం అడ్డంవచ్చి, తత్ఫలితంగా యీ కవరొచ్చింది! నిరుత్సాహంగా కవరు చించింది

"పూజ్యులైన అమ్మకి నమస్కరించి వ్రాయునది, చెల్లి పెళ్ళి కళ్ళారా చూడా లన్న కాంక్ష, అమ్మని చూడాలన్న తపన, నాకు పిచ్చెక్కించేస్తున్నాయి! కానీ, యేం చేయగలనమ్మా? ... నాన్నగారి వద్దనుండి వదులుకోలేక, వెంటతెచ్చుకున్న 'అభిమానం' నన్ను మీ ప్రేమపాశానికి కూడా దూరంగా విసిరేస్తుంది! అందుకనే, కాంక్షలు, కోర్కెలనైనా చంపుకోగలను కానీ, అభిమానాన్ని చంపుకోలేను! నేనూ, మా వారు, తలలు వంచుకొని నిల్చో లేము! చిన్నా దూర-దూరంగా తిరిగి ఆడుకోలేదు! నాన్నగారి కఠిన దృక్కు లనీ, మీ దయనీయ చూపులనీ భరించడం నా వల్లకాదు గతం మనకు తెలిసిందే కదా! అందుకే మమ్మల్ని, ముఖ్యంగా 'నన్ను' క్షమించమని శతకోటి వందనా లర్పించుకుంటున్నాను! చెల్లి సౌభాగ్యాన్ని మనసారా వాంఛిస్తూ, శుభాకాంక్షలు తెలుపుకుంటున్నాను!

ఇట్లు
విజ్జి!"

ఉత్తరం చదివిన మాలతి గుండెలు బరువెక్కిపోయాయి! లేచి, తన గదిలో కెళ్ళి పడుకుంది

'విజ్జి బి.ఏ. చదువుకుంటున్న రోజుల్లో కాలేజీనుండి ఆలస్యంగా రావడం మొదలెట్టింది. తానొకరోజు నిలదీసి అడిగితే, కాలేజీ లెక్చరర్ ఆనందరావుని ప్రేమిస్తున్నానని, అతనితో పార్క్‌కి వెళ్ళొస్తున్నానని చెప్పింది! పైగా అతను ఆస్తిపాస్తులు కూడా లేనివాడుట! ఈ సంగతి ఆయనకి తెలిస్తే యింకేమైనా వుందా? ... యేం చేయడం? అని ఆలోచిస్తూండగానే 'విజ్జి' కి సుస్తీ చెయ్యడం, వెంటనే కంగారుపడి తమ ఫామిలీ డాక్టర్‌ని పిలవడం, ఆమె నెల తప్పినట్టు చెప్పడం జరిగింది. అది విని నిర్వెరపోయింది తను. ఆయన అగ్గిమీద గుగ్గిల మయ్యారు. ఆనందరావుని జైలుపాలు చేస్తానని విజ్జీని అబార్షన్ చేయించు కోమని. నానా గొడవ చేశారు.




కానీ, విజ్జీ ఒప్పుకోలేదు. తాను ఆనందరావునే చేసుకుంటానని పట్టు పట్టింది. ఆదే నిర్ణయంతో అతనుకూడా యింటికి వచ్చాడు ఆయన యిద్దర్నీ యిష్టమొచ్చినట్టు తిట్టి, యికమీదట తనకు ఒక్కతే కూతురని విజ్జీకీ, తనకూ సంబంధం లేవని, తాను చచ్చినా సరే, విజ్జీ మాత్రం యీ గడపలో కాలుపెట్ట రాదని శాసించి, యెంత చెప్పినా వినకుండా విజ్జీని వెళ్ళగొట్టేశారు. అంతే కాదు! ఆనందరావుని ఆరునెల్లోగా చాలా దూరప్రాంతానికి బదిలీ చేయించారు.

బదిలీఅయి వెళ్ళేనాటికి విజ్జీ పచ్చి బాలింత ఆడపిల్లని కని, ఆ పసికందుతో అలాగే భర్త వెంట వెళ్ళి పోయింది. వారు వెళ్ళకముందు గుడికో, బజారుకో వెళ్ళినప్పుడల్లా భర్తకి తెలీ కుండా తాను విజ్జీ వాళ్ళింటికెళ్ళి, చూచి వస్తూండేది

విజ్జీ దూరమై మూడేళ్ళయింది. పెళ్ళిలోనైనా చూడవచ్చు అనుకుంటే ఆ ఆశ నిరాశ అయ్యింది. మాలతి మాతృహృదయంలో దుఃఖసాగరం పొంగి పొర్లింది

ఇద్దరే యిద్దరు కూతుర్లయినప్పుడు ఆయన కెందుకంత పక్షపాతం? ఇద్దరు పిల్లలూ తమకు సమానమే అయినా, యెందుకో పెద్దపిల్ల 'విజ్జీ' అంటే తనకు అమిత యిష్టం! అలాగే చిన్నది సుమతి అంటే ఆయనకి ప్రేమ! ఆడది కనుక తనేం చెయ్యలేకపోయింది విజ్జీ విషయంలో. మగవారు గనుక, తన ముద్దుల కూతురు సుమతి చేసిన ఘన కార్యాన్ని మెచ్చుకొని, బ్రహ్మాండంగా పెళ్ళి చెయ్యాలని యేర్పాట్లు చేస్తున్నారు!

అసలేమిటో యీ పక్షపాత వైఖరి కనుక్కోవాలి! ఆడది నోరు మూసుకు

కూర్చున్నంతకాలం యీ మగాళ్ళ ఆగడాలు యిలా హద్దులు మీరిపోతూనే వుంటాయి!

'ఆ ది' తొ మ్మి ది వం ద లు సంపాయించుకునే లెక్చరర్‌ని ప్రేమిస్తే తప్పొచ్చిందట! 'ఇది' తన దగ్గర అప్రెంటీసు యేడ్చి యీ మధ్య ప్రాక్టీసు పెట్టిన కుర్రకాకి లాయర్‌ని ప్రేమిస్తే, మంచిపని చేసిందట! ఇంత చేసి, కులస్థుడాంటే, అదీకాదు! యేమైనా సరే! యీ రోజు ఆ సంగతేదో తేల్చు కోవాలి.

'ఆయనే వెళ్ళి, మర్యాదగా విజ్జీ వాళ్ళందరినీ వెంటబెట్టుకొస్తారో, లేక పోతే యీ అన్యాయం భరించలేక తనని 'ఆత్మహత్య' చే సు కో మం టా రో అడగాలి!

దృఢనిశ్చయంతో లేచింది కన్నీళ్ళతో తడిసిన దిండుని వో మూలకు విసిరి, ముఖం తుడుచుకుంది. అంతలో భర్త హడావిడిగా రూమ్‌లోకొచ్చాడు.

భార్య ముఖకవళికలు గమనించాడు. "నాకూ కూడా బాధగానే వుంది మాలతీ విజ్జీ రానందుకు! కానేం చేద్దాం? యేదో.. జరిగిపోయింది!" అంటూ ఆమెను దగ్గిరకు తీసుకోబోయాడు.

మాలతి అతని చేతిని నెట్టివేసింది. తన మనస్సులో వున్న బాధనంతా వెళ్ళగక్కింది. తన రక్తంలో పాలు పంచుకు పుట్టిన బిడ్డలపట్ల, యే తండ్రికీ యింతటి పక్షపాత బుద్ధి వుండదని అంది. ఇంతటి విపరీతాన్ని చూస్తూ బ్రతికేకంటే తాను వెంటనే చచ్చిపోతానంది!

అంతా విని బరువుగా నిట్టూర్చాడు. జాలిగా మాలతివంక చూసాడు. "చూడు మాలతీ!" ఆమె కన్నీళ్ళు తుడుస్తూ, "నువ్వు అన్నమాట ఆవేశపూరితమైందే తప్ప, నిజమైంది కాదు! ఎందుకంటే, 'పక్షపాత బుద్ధి' అన్నది నా కెప్పుడూ లేదు! నేను వృత్తికి న్యాయాధికారిని! న్యాయాన్ని కాపాడడమే నా ధర్మం! ఇన్నేళ్ళ స ర్వీ సు లో, నా వృత్తి ధర్మాన్ని నే నెప్పుడూ ఉల్లంఘించ లేదు!" అన్నాడు.

"విజ్జీకి నేనేదో అన్యాయం చేశానని, సుమతిని వెనకేసుకొస్తున్నానని అను కోవడం పొరబాటు!" కాస్త దూరంగా జరిగి, అరుణిమను సంతరిస్తున్న అస్తాద్రి దినకరుడిపై దృష్టి మళ్ళించాడు.

"సూర్యుడు అందరికీ వెలుగు నిస్తాడు. కానీ వుదయించే సూర్యుడు అలాకాదు, చెట్లు - కొండలు అడ్డొచ్చి అస్తవ్యస్తంగా వెలుగునిస్తాడు. అలాగే విజ్జీ ప్రేమ వ్యవహారం బయటపడే నాటికి, వృత్తిరీత్యా నేను లాయర్‌ని. అంటే ఉదయించే సూర్యుడినన్నమాట! న్యాయవాది కెప్పుడూ తన క్లయింటే ముఖ్యం. ఆ క్లయింట్‌ని గెలిపించడం కోసం వాదించడమే న్యాయవాది ధర్మం!

అందువల్ల, ఆ నాడు నా కూతురే నాకు క్లయింట్. నా కులం, గౌరవం, అంతస్తుకు తగిన వరుడిని వెదికి, పెళ్ళి చేయవలసిన బాధ్యత నాది! అలాంటి సమయంలో 'విజ్జీ' నాకు అన్నివిధాలా 'అవమానం' కలిగించే పని చేయబూనింది. అందుకే అడ్డు చెప్పాను. వాదించాను. ఆఫ్‌కోర్స్ ... చివ్వరికి నేనే వోడిపోయాననుకో!

"కానీ మాలతీ! యీ రోజు నేను జడ్జిని! నడినెత్తిన ప్రకాశించే సూర్యుడులాంటివాడిని!" భార్యవైపు తిరిగి అన్నాడు.

"లాయర్‌గా వున్నప్పుడు. యెప్పుడూ త్రాసు నావైపే మొగ్గాలి అనుకునేవాడిని!

"అయితే, యిప్పుడలా కాదు నేను న్యాయాధికారిని. యెప్పుడూ నాకు త్రాసు సమంగా వుండాలి!

జూన్ నెల యువ

# భావపరిచయ పోటీ

**బహుమానం రూ. 25-00**

**ఈ కార్టూనుకు హాస్యయుత వాక్య (Caption) కావాలి**



**గమనిక :** వ్యాఖ్యలు పోస్టుకార్డుమీదనే వ్రాయాలి.
ఏప్రెల్ 1వ తేదీ లోపు మాకు చేరాలి.

"కనుకనే యుక్తవయస్కురాలైన వో స్త్రీ, తనకు నచ్చిన మరో యువకుడిని ప్రేమిస్తే, వారి మానసిక, శారీరక, ఆర్థిక పరిస్థితులను పరిశీలించి, అది సమమైన, పరిపూరకమైన, అవివాహితుల ప్రేమగా గుర్తించి, జడ్జిగా అంగీకరించాను. తండ్రిగా యీ పెళ్ళికి యేర్పాట్లు చేశాను! ఇప్పుడు కులగోత్రాలు, ఆస్తి, అంతస్థులు కాదు నాకు ముఖ్యం! నాకు మనుషులంతా ఒక్కటే! నేను న్యాయాధికారిని! ఆనాటి ధర్మం మారింది!


"అంతేకాదు! విజ్జీకి, నాకూ యిప్పుడు యెలాంటి విరోధమూ లేదు. ఈ రోజే నేను స్వయంగా వెళ్ళి, విజ్జీని, అల్లుడిని, మనుమరాలినికూడా పెళ్ళికి తీసుకురాబోతున్నాను. యిది చెప్పాలనే యిప్పుడు నేను యిక్కడికొచ్చాను. నాకంతా సమానమే! ఇంతలో నువ్వే తొందరపడ్డావు!

"జరిగిందేదో జరిగిపోయింది. నువ్వేమీ బాధపడకు! నగలూ, బట్టలూ యింకా నువ్వు సెలక్ట్ చెయ్యలేదని తెలిసింది. సుమతికి, విజ్జీకి సమంగా సెలెక్ట్ చెయ్యి. ఇద్దరూ నాకు సమంగా వున్న త్రాసులోని రెండు సబ్బెలు! నాకు ముద్దుల బిడ్డలు! మరి ... వెళ్ళొస్తా ..." అని ప్రయాణమయ్యాడు.

భర్తమాటలకి అవాక్కయిన మాలతి 'ధర్మం మారిందా ... ?' అంది, అసంకల్పితంగా.

## మే నెల యువ భావపరిచయ పోటీ

*బహుమతి పొందిన వ్యాఖ్య*



*డా॥ వారధి, యం. బి. బి. ఎస్.*

— ఎస్.సి.వి.బి. చారి, పాల్వంచ.